# అదృశ్యమవుతున్న జాతి

పలమనేరు బాలాజి

బెంగుళూరు.

ఆదివారం సాయంత్రం. రోడ్డుకు ఇరు వైపులా పరచిన పుస్తకాల్ని చూసుకుంటూ వెడుతున్నాం నేనూ, కిషోర్.

గుట్టలు గుట్టలుగా ఉన్నాయి పుస్తకాలు. కొత్తవి, పాతవి చాలా పాతవి, కొద్దిగా పాతవి. అట్టలు నలగనివి. అట్టలు చిరిగినవీ, అస్సలు అట్టలు లేనివి. స్వదేశీవీ, విదేశీవి.



ఆ వీధిమొత్తం ఒకసారి తిరిగాక మళ్ళీ అక్కడ్నుంచీ, ఒక్కోచోటే ఆగుతూ పుస్తకాల్ని పరిశీలిస్తూ మెల్లగా కదులుతున్నాడు కిషోర్. వాడెప్పుడవా అంతే. ముందుగా ఫుట్‌పాత్‌ల పైన పరచిన పుస్తకాలన్నీ ఒకసారి చూసుకుని, ఆ తర్వాత తీరిగ్గా వెతుకులాట మొదలుపెడతాడు.

"ఏం పుస్తకం కావాల్రా నీకు. నడిచి నడిచి కాళ్ళు నొప్పెడుతూ వున్నాయి" అన కూడదని అనుకుంటూనే అనేసాను.

కిషోర్ దీక్షగా పుస్తకాల్నే పరిశీలిస్తూ "నీ ప్రశ్న అర్థం లేనిది కుమార్. వెతుకుతూ వుండాలి. దొరికిందాన్ని బట్టి మన వెతుకులాటని ముగించటమో, కొనసాగించటమో చేయాలంతే" అన్నాడు తల తిప్పకుండానే.

ఈ రకం జవాబు నాకు కొత్తేమీ కాదు. హైదరాబాద్‌లో ఉన్నంత కాలం ఆదివారాలు ఈ రకం సమాధానాల్ని విని వినీ అలవాటు పడిపోయాను. యూనివర్శిటీ చదువులు ముగిసాక నాకు బెంగుళూర్లో ఉద్యోగం రావటంతో నేనిలా వచ్చేసాక గత మూడు సంవత్సరాలుగా ఈ రకం మాటలు వినే భాగ్యం నాకు లేకుండా పోయింది.

కిషోర్‌కు హైదరాబాద్‌లోనే ఉద్యోగం రావటంతో వాడు అక్కడే వుండిపోయాడు. ఏవేవో ప్రాజెక్టు రిపోర్టులు పరిశోధనలు అంటూ ఏవేవో పుస్తకాల్ని సేకరించి డేటా తయారు చేస్తుంటాడు కిషోర్.

చాలా తక్కువ వ్యవధిలోనే మళ్ళీ కిషోర్ సెల్ మోగింది. ఇయర్ ఫోన్స్ తగిలించుకుని కంపెనీ వాళ్ళతో ఏవో ఆఫీసు విషయాల్లో పడ్డాడు కిషోర్.

ఆఫీస్ పనిపైన బెంగుళూరుకు వచ్చాడు కానీ లేదంటే రెండురోజుల తీరిక వాడికి కలలో కూడా దొరికేది కాదేమో.

"నువ్వు బెంగుళూల్లో ఉన్నప్పట్నుంచి నాతోకన్నా సెల్‌ఫోన్లోనే ఎక్కువ మాట్లాడుతున్నావురా. ఈ మాత్రానికి నేను నానా తంటాలు పడి సెలవు పెట్టడం దేనికి? దండగ" అన్నాను చిరాగ్గా.

మర్యాదగా రెండ్రోజులు సెలవు అడిగితే ఇచ్చే ఆఫీసు కాదు మాది. రోగమొచ్చినా, ఎవరిదైనా చావు కబురే అయినా సరే కొంచెం ముందుగా చెప్పి తీరాలంటాయి ఆఫీస్ రూల్స్

"నువ్వీ సంవత్సరంలో ఇప్పటిదాకా ఎన్ని లీవులు వాడింటావో చెప్పు" ఏదో కుతూహలం తొంగిచూసింది కిషోర్ గొంతులో.

"సెలవా? సెలవంటే ఏమిటో మరచిపోయాను. సంపాదిస్తున్నాం అన్నమాటే కానీ తీరిక లేకుండా పోయిందిరా. ఆదివారాలు కూడా వాళ్ళు రమ్మనటమో, ఎక్స్‌ట్రా అవర్స్ కోసం నేనే వెళ్ళటమో చేస్తుంటా. ఉద్యోగంలో పడి నన్ను నేను

మరచిపోయానురా'' అన్నాను.

నా మాటల్ని వాడు ముందుగానే ఊహించినట్లుంది. నేను మాట్లాడ్డం మొదలు పెట్టగానే తలాడించసాగాడు.

''దేర్ యూ ఆర్. సెలవు రోజుల్ని నువ్వు మరచిపోతున్నావ్ కదా. అసలు బెంగుళూరు ఎట్లా వుందో అని ఒకసారైనా చూశావా? చూసిందవులే. నాకు తెల్సు. ఆఫీస్‌లో ఎన్నో స్ట్రగుల్స్. ఆత్మగౌరవాన్ని మరచిపోయామేమో అనిపిస్తుందిరా. అసలు దేనికీ మనసు స్పందించడమే మానేసింది. అంతా రొటీన్‌గా అనిపిస్తుంది'' కిందకు వంగి ఏదో పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పుతూ అన్నాడు కిషోర్.

సన్నగా తుంపర మొదలైంది. కిషోర్ మళ్ళీ సెల్ ఫోన్లో ఎవరికో ఏదో చెబుతూ వున్నాడు. కంప్యూటర్స్ భాష వినీ వినీ విసుగొచ్చేసింది.

గుల్‌మొహర్ చెట్టుకింద టీ షాప్ కనిపించటంతో కిషోర్‌కి సైగ చేసి, షాప్ చూపించి నేను అటువైపు కదిలాను.

నూనె కాగిన వాసన. బజ్జీలు, వడలు, పకోడ.. దుకాణం సందడిగా వుంది. టీ చేస్తున్న అతడ్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. జనం మధ్యలోంచి చోటు చేసుకుని, ఓవైపు చివరన నిలబడ్డాను. పెనం ముందుకూర్చుని వున్న స్త్రీని చూడగానే ఉలిక్కిపడ్డాను. అనుమానం లేదు. ఆమె కోటూరు శివకాయమ్మే. మా ఊరి మనిషి. వెంటనే టీ చేస్తున్న మనిషి ఎవరో క్షణంలో గుర్తొచ్చేసింది. అతడు సుబ్రమణ్యం. బనీను సుబ్రమణ్యం. శివకాయమ్మ భర్త.

స్థలం, కాలం తెచ్చిన మార్పులు వాళ్ళిద్దర్లోనూ స్పష్టంగా కనపడుతూనే ఉన్నాయి. కానీ ఆ రూపాల చాటున, నగర నాగరికత వెనుకా మా వూరి ఆనవాళ్ళు సజీవంగా తెలుస్తున్నాయి.

ఆమెకిప్పుడు నా అంచనా ప్రకారం ముప్పై ఐదేళ్ళుంటాయి. ఆమెకన్నా అతడు కనీసం పదేళ్ళు పెద్దవాడై వుంటాడు. ముందుకన్నా ఇప్పుడు ఆమె బలిష్టంగా కనపడుతోంది. పొడవాటి మనిషి. చామనఛాయ. అతడు మాత్రం బాగా లావయినట్లున్నాడు. చింపిరి జుట్టుతో, పెరిగిన గడ్డంతో, మాసిపోయిన లుంగీపైన ఎప్పుడూ బనీను మాత్రం వేసుకుని కనిపించేవాడు. అందుకే అతడ్ని అందరూ బనీను సుబ్రమణ్యం అని పిలిచే వాళ్ళు.

ఎక్కడి కోటూరు. ఎక్కడ బెంగుళూరు. పుట్టిన ఊరు, సొంత ఇల్లు, రెండు ఎకరాల పొలం అన్నీ విడిచి శివకాయమ్మ బెంగుళూరుకు ఎందుకు వచ్చి చేరిందో అర్థం కాక, తల విదిలించాను. నాన్న చనిపోయాక, అమ్మ తిరుపతిలో అన్నయ్య వాళ్ళింటికి వచ్చేయడంతో, మా ఊరుకు వెళ్ళాల్సిన అవసరం కలగనేలేదు. తిరుపతి, హైద్రాబాద్‌లో చదువుల తర్వాత నేను ఉద్యోగం కారణంగా బెంగుళూరుకు వచ్చేసాక, నాకు మా ఊరి విశేషాలు ఎట్లా తెలుస్తాయి?

అప్పుడే ఖాళీ అయిన ఓ చెక్క స్టూల్‌పై కూర్చున్నాను. సుబ్రమణ్యం టీ తీసుకువచ్చాడు. టీగ్లాసు అందుకుంటూ బలవంతంగా నవ్వటానికి ప్రయత్నించాను. కానీ పెదవులు కదలల్లేదు.

కోటూరుకు ఉత్తరం వైపు చెరువు, దాన్ని దాటుకుని ఆ పక్క అడవి మొదలవుతాయి. బండిబాటకు అటువైపు వుండేటి కస్తూరమ్మ ఇల్లు, పెంకుటిల్లు. ఒంటిల్లు. కస్తూరమ్మంటే శివకాయమ్మ వాళ్ళ అమ్మ. కస్తూరమ్మంటే ఊర్లో పిల్లలందరికీ హడల్. జామకాయలు, సపోటాలు, మామిడికాయల కోసం ఎవరైనా అటువైపు వెడితే చాలు, అలా వెళ్ళిన వాళ్ళు చాలా ధైర్యస్థులకిందే లెక్క. వెళ్ళి కస్తూరమ్మ కళ్ళబడకుండా, ఆమె చేతికి చిక్కకుండా కాయో పండో ఏదో ఒకటి సాధించుకు వచ్చాడంటే వాడింక హీరోయే.

కస్తూరమ్మది ఈ ప్రాంతం కాదు. తమిళనాడు సరిహద్దులో ఏదో పల్లెటూరు. ఆమె మొగుడు చాలా విరుద్ధం మనిషని, తాగి ఆమెను చావబాదేవాడని, అనుమానించేవాడని, ఆ దారంట వెళ్ళే ప్రతి మొగవాడితో రంకు అంటగట్టి చిత్రహింసలు పెడుతూ వుండేవాడని, ఆ బాధలు తట్టుకోలేక కడుపుతో వున్నప్పుడు, కడుపులో వున్న బిడ్డకు దెబ్బలు తగలకుండా కాపాడుకునే ప్రయత్నంలో, మొగుడ్ని చంపేసిందని, లేదూ అతనే ఆత్మహత్య చేసుకున్నాడని ఊర్లోవాళ్ళు రకరకాలుగా చెప్పుకునేవాళ్ళు. తాగిన మత్తులో అతడే కాలుజారి బావిలో పడిపోయాడని కూడా అనేవాళ్ళు. కస్తూరమ్మ కూలికిపోయినా రెండు మూడు ఆవుల్ని సాకి పాలు అమ్మినా, ఒంటిచేత్తో వ్యవసాయం చేసినా బిడ్డను అపురూపంగానే సాకి పెద్ద చేసిందంటారు. తను పడిన కష్టాలు తన బిడ్డ పడకూడదని అనుకుందట. రెండెకరాల నేలను చూసే కదా తనను తాగుబోతు మొగోడికి ఇచ్చి పెండ్లి చేసారని వాళ్ళ వాళ్ళను తిట్టిపోసేదిట. తనకు కాబోయే అల్లుడికి పొలం, పుట్రా లేకపోయినా పర్వాలేదు, గుణం బావుంటే చాలనుకుని వెతికి వెతికి పీలేరు దగ్గర్నుంచి సుబ్రమణ్యాన్ని ఇల్లరికం అల్లుడ్ని చేసుకుంది.

నూనె కాగిన వాసన. బజ్జీలు, వడలు, పకోడ.. దుకాణం సందడిగా వుంది. టీ చేస్తున్న అతడ్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. జనం మధ్యలోంచి చోటు చేసుకుని, ఓవైపు చివరన నిలబడ్డాను. పెనం ముందుకూర్చుని వున్న స్త్రీని చూడగానే ఉలిక్కిపడ్డాను. అనుమానం లేదు. ఆమె కోటూరు శివకాయమ్మే. మా ఊరి మనిషి.

అతను మంచివాడు, పెళ్ళాం చెప్పినట్టు వినేవాడే కానీ అతనో వెర్రిబాగులవాడు. ఎవరేం చెప్పినా చేసేవాడు. ఎవరేం తిట్టినా పడేవాడు. ఎవరు కొట్టినా దెబ్బలు తినేవాడు. ఊర్లో పిల్లలే కాదు పెద్దోళ్ళూ అతడ్ని ఆటపట్టించేవాళ్ళు. ఆటల్లో మాత్రం అతడు బహు నేర్పరి. ఏ ఆటలో అయినా అతడ్ని ఓడించడం మా వల్ల కాలేదు. తానొకటి తలిస్తే కూతురి బతుకు ఇట్లా అయిందేమిరా అనే మనోవ్యాధితో కస్తూరమ్మ చనిపోయాక, సుబ్రమణ్యం బాధ్యత మొత్తం శివకాయమ్మ పైనే పడింది. అతడి వెర్రిబాగులతనాన్ని ఆసరాగా తీసుకుని చాలామంది మొగవాళ్ళు శివకాయమ్మ కోసం ఆరాటపడ్డారు కానీ వాళ్ళ ఆటల్ని ఆయమ్మ సాగనివ్వలేదు.

''ఊర్లో పిల్లల్ని చదువుకోనీకుండా, పనులకు పోనీకుండా చెడగొడుతున్నాడని'' జనం సుబ్రమణ్యాన్ని ఆడిపోసుకుంటే శివకాయమ్మ ఎవర్నీ లెక్కచేసేది కాదు. మొగుడ్ని వెనకేసుకు వచ్చేది.

''నా మొగుడికి తెలియనితనమేనమ్మా. ఒప్పుకుంటా. మీ మొగోళ్ళు తెలివైనోళ్ళయితే నా కొంపకాడ తచ్చాడతారెందుకమ్మా. రానీ ఆ నాబట్టల్ని. కాళ్ళూ సేతులు యిరిసి పంపిస్తా'' అని దబాయించేది. మొగుడికి నయం చేయించాలని కోలారు, బాగాయం, తిరుపతి ఆసుపత్రుల చుట్టూ, నాటు వైద్యాలు చేసేవాళ్ళ చుట్టూ తిరిగేది.

ఇక్కడిదాకా నాకు తెలుసు. ఆ తర్వాత ఏం జరిగిందో ఆ కథంతా శివకాయమ్మ చెప్పాల్సిందే. ఆమె వైపు చూసాను. నూనెలో వేయించినవి తీసి వేస్తూనే, మరోవైపు డబ్బు తీసుకుని చిల్లర ఇస్తోంది. టీ చేయడం, టీగ్లాసులు, బజ్జీలు అందించడం, గ్లాసులు, ప్లేట్లు కడగడం సుబ్రమణ్యం వంతులాగా వుంది.

ఇప్పట్లో రాడనుకున్న కిషోర్ వచ్చేసాడు. చేతిలో ఏవో పుస్తకాలు. నా దగ్గరున్న పుస్తకాలకు అవి అదనంగా వచ్చి చేరాయి.

''ఇందాక ఏందో చెప్తావుంటే వొచ్చేశావ్. నాకు లేదా టీ? మాస్టర్ మాంచి స్ట్రాంగ్ టీ ఒకటి'' చిన్నగా అరచి చెప్పాడు కిషోర్.

కిషోర్‌వైపు చూసి మెల్లగా నవ్వాను. కిషోర్ తల తుడుచుకుంటూ ''ఆ గుర్తొచ్చింది'' అన్నాడు తల ఆడిస్తూ.

''స్పందన గురించి కదా చెబుతున్నాను. భూకంపాలకు, సునామీలకు, యాక్సిడెంట్స్‌కు,మందుపాతర్లకు, హత్యలకు, ఆత్మహత్యలకు, ఈ సంక్షోభాలకు, విధ్వంసానికీ అసలు మనసు స్పందించటమే మానేసిందిరా కుమార్. టీవీలో పేపర్లో వార్తల్ని చూసి చూసీ ఏం జరిగినా అదంతా మామూలే అన్నట్లు ఏడుపు రావడం లేదు. బాధ కలగటం లేదు. కొంచెం కూడా నొప్పిగా అనిపించడం లేదు. ఎందుకురా?''

వింటూ టీ తీసుకు వచ్చిన సుబ్రమణ్యం వైపు తేరిపారా చూస్తూ అతడ్ని పలకరించాను.

''ఏం సుబ్రమణ్యం బావుండావా? బెంగుళూరు ఎప్పుడొచ్చినారు'' అతడి మొహంలో మార్పేమీ లేదు. తల గోక్కోలేదు. పళ్ళు యికిలించలేదు. మౌనంగా కదిలిపోయాడు. అతడ్ని పేరుపెట్టి పిలవటం చిన్నప్పటి అలవాటు.

కిషోర్ ఆశ్చర్యంగా చూసాడు. అతడు టీ తాగేంతలోగా టూకీగా వాళ్ళ విషయం చెప్పాను. మళ్ళీ సెల్ ఫోన్ రింగ్ అవటం, కిషోర్ మాటల్లో మునిగిపోవటం చకచకా జరిగిపోయాయి.

''మా కంపెనీ అతను నాకోసం హోటల్లో వెయిట్ చేస్తున్నాడు. అతడితో అర్జెంట్‌గా మాట్లాడాలి పద పద. బస్సులు దొరికితే సరి లేదా ఆటోలో వెడదాం''

కొంచెం టీ ఇంకా గ్లాసులో మిగిలేవుంది. పెట్టేసాడు. నాకైతే మరికాస్సేపు అక్కడే వుండాలని, శివకాయమ్మను పలకరించాలని వుంది.

టీ డబ్బులు చెల్లిస్తూ ఆమె వైపు మరోసారి పరిశీలనగా చూసాను. చిల్లర ఇస్తూ ఆమె కూడా నావైపు యధాలాపంగా చూసి తల తిప్పుకుని పనిలో నిమగ్నమైంది.

ఆమె గురించి తెలుసుకోకుండానే అసంతృప్తిగా అక్కడ్నుంచి కదిలాను.

ఆ వీధి దాటి బస్టాపుకొచ్చి నిలబడ్డాం. బస్సు వచ్చింది. కాసేపట్లో సీట్లు కూడా దొరికాయి. చలి ఎక్కువవడంతో రెండు అరచేతుల్ని రుద్దుకుంటూ కిషోర్ అన్నాడు.

''అడవులు శిథిలమవుతూ అడవి జంతువులు పల్లెలపైన పడి పొలాల్ని, మనుషుల్ని కబళించటం గురించిన మంచి నవల అది. నదులు, లోయలు

అదృశ్యమవటం గురించి కూడా మంచి పుస్తకాలు దొరికాయి''

అప్పుడు కంగారుగా చూసుకున్నాను. వాడి చేతుల్లో అప్పుడే కొన్న పుస్తకాలు మాత్రం వున్నాయి. మొదట కొన్నవి నా దగ్గర ఇచ్చాడు. నేను వాటిని టీషాప్‌లో స్టూల్ పక్కన పెట్టిన విషయం గుర్తొచ్చింది.

భయపడుతూనే విషయం చెప్పాను. వాడు హఠాత్తుగా సీట్లోంచి లేచి నిలబడ్డాడు.

''స్టాప్'' అని ఒక్కసారిగా కేక పెట్టాడు. వాడేదో కంగారులో అలా అరిచాడు కానీ స్టాప్ అని అరచినంత మాత్రాన మహానగరాల్లో సిటీబస్సులు ఆగుతాయా? నింపాదిగా బస్సు వెడుతూనే వుంది.

''ఎట్లారా. నేను అక్కడ అతడ్ని కలవాలి. పుస్తకాలు మిస్సయితే మాత్రం నేను ఊరుకోను. ఏం చేద్దాం?'' కిషోర్ మొహం నిండా ఆందోళన.

''సర్లేరా. నువ్వీ బస్ దిగినాక ఆటో తీసుకుని హోటల్‌కు వెళ్ళు. నేను మళ్ళీ ఆ షాప్ దగ్గరకు వెళ్ళి పుస్తకాలు తీసుకువస్తా. మళ్ళీ నీకు మొబైల్‌కు ఫోన్ చేస్తా కదా. కంగారు పడద్దు. పుస్తకాల్ని ఎవ్వడూ పట్టుకుపోడు'' అని సర్దిచెప్పి, తను ఏ స్టాప్‌లో దిగాల్సిందీ, ఆటోలో ఎంతసేపు ప్రయాణించాల్సిందీ చెప్పి నేను బస్సాగిన చోట దిగేసాను. రోడ్డు దాటి బస్టాపు చేరుకున్నాను.

టైం చూశాను. ఎనిమిదీ యాభై అవుతోంది. శివకాయమ్మ గురించి తెలుసుకోకుండానే వెళ్ళిపోయాక కలిగిన అసంతృప్తి నాలో మాయమైంది.

ఈ రకంగా మళ్ళీ అక్కడకు వెళ్ళే అవకాశం రావటం గమ్మత్తుగా అనిపించింది.

బస్సు వచ్చింది. సీట్లు ఖాళీ లేవు. ఎట్లాగో రద్దీలో నిలబడ్డాను. అప్పటికి తుంపర పూర్తిగా ఆగిపోయింది.

టీ షాప్‌లో రద్దీ తగ్గిపోయింది. పుస్తకాలు అక్కడే వున్నాయి. ''ఏం సుబ్రమణ్యం ఇంకో టీ ఇస్తావా స్ట్రాంగ్‌గా'' అన్నాను కొంచెం గట్టిగా ఆమెకు వినపడాలనే ఉద్దేశ్యంతో.

టీ ఆమే తీసుకువచ్చి నావైపు ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడింది. గొంతులోపల అప్పటివరకూ తచ్చాడుతున్న పలకరింపు గట్లు తెంచుకుని బయట కొచ్చింది.

''ఏం అత్తా! బాగుండావా. మామ నన్ను గుర్తుపట్టనే లేదు చూస్తివా'' ఆశ్చర్యంగా, అయోమయంగా, అనుమానంగా నావైపు చూస్తున్న ఆమెను ఇంకా కంగారు పెట్టడం ఇష్టం లేక మా అమ్మపేరు, నాన్నపేరు, నా పేరు చెప్పి నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

ఆమె మొహంలో మార్పు చాలా స్పష్టంగా గమనించగలిగాను. ఆమె కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. మొహం విప్పారింది. నా రెండు భుజాలు చుట్టూ చేతులు వేసి నా మొహంలో ఏదో ఆనవాలు కోసం అన్నట్లు పరీక్షగా చూస్తూ, మాట్లాడ్డం మొదలుపెట్టింది.

ఆమె మొహంలో మార్పు చాలా స్పష్టంగా గమనించగలిగాను. ఆమె కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. మొహం విప్పారింది. నా రెండు భుజాలు చుట్టూ చేతులు వేసి నా మొహంలో ఏదో ఆనవాలు కోసం అన్నట్లు పరీక్షగా చూస్తూ, మాట్లాడ్డం మొదలు పెట్టింది.

ఆమె చేతుల్లోని వణుకు నా భుజాలకు తెలుస్తోంది. ఆమె మాటల్లోని వణుకు నా చెవులకు తెలుస్తోంది. ఆమె కళ్ళలోని వణుకు నా కళ్ళకు తెలుస్తోంది.

''కుమారూ ఎంతకాలం అయిందప్పా నిన్ను చూసి. మీ అమ్మా, పెద్దనాయినా, చిన్నాయనా వాళ్ళు, మీ అన్న, తమ్ముడు అందురూ బావుండారా? పోన్లే నువ్వయినా ఇంతకాలానికి కనిపించావు. నిన్ను చూస్తా వుంటే మీయమ్మ ప్రభావతమ్మను చూస్తావున్నట్లే వుండాది. నిన్ను చూస్తావుంటే మనూర్ని చూస్తావున్నెట్లుంది. చెరువు, అడివి, పొలాలు, అగ్గార్లు, కళ్ళముందరే మెదలతా వుండాయి. మనూరికి పోతావుండావు కదా నువ్వయినా...'

నా భుజాల చుట్టూ చేతులు వేసి, మొహం దగ్గరగా మొహం పెట్టి ఆమె అలా ఉద్విగ్నంగా మాట్లాడుతూ వుంటే నా గొంతు మూగబోయింది కాస్సేపు.

ఊరు గురించి, ఊర్లో వాళ్ల గురించీ, ఏవేవో స్మృతుల్ని నెమరు వేసుకుంటూ అలా అడుగుతూనే వుంది. తనలో తాను కలవరిస్తున్నట్లు, కలలో మనిషిలా ఆమె మాట్లాడుతోంది.

సుబ్రమణ్యం టీ తీసుకువచ్చి ఆమెకు అందించాడు. ఆమె నా భుజాలపైన వేసిన చేతులు తీసివేసి, కొంచెం వెనకు నడిచి నిలబడి, టీ తాగుతూ నా వైపే చూస్తుండి పోయింది.

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం. మాటల్లేవు. ఆమెను చూస్తుంటే, ఆమె గుర్తుచేసిన మా ఊరు, ఆమె కళ్ళముందు నుంచీ కదిలి, నా కళ్ళ ముందుకొచ్చింది.

గోనె సంచుల్ని తలపైనుండి వీపుల వరకూ కప్పుకున్న ఇద్దరు కూలీ మనుషులు రావడంతో, సుబ్రమణ్యం వాళ్ళకు టీ అందించే పనిలో పడ్డాడు. వచ్చిన వాళ్ళు బార్యాభర్తలు కాబోలు ఏదో చెప్పుకుని నవ్వుకోసాగారు.

నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళ వైపు ఆమె యధాలాపంగా చూసింది. ఆమె కళ్ళల్లో ఏదో సంతృప్తి కదలాడింది. మొహంలోకి నవ్వు వచ్చింది. ఆ కళ్ళల్లో మెరుపు మెరిసినట్లయ్యింది.

'' ఏం వదినా పనిలోంచి ఇంటికి పోతాండారా. లేటయ్యిందే'' కన్నడంలో పలకరించింది శివకాయమ్మ చిరునవ్వుతో.

''పని రోజూ వుండేదే కదక్కా. ఈ దినం మా పెండ్లిరోజు. సినిమాకి పొయ్యొంటిమి. ఇంటికి పోతాండాం''

''ఎన్నేండ్లయ్యింది వదినా పెండ్లయ్యి''

''ఎనిమిదేళ్ళక్కా''

వాళ్ళతో మాట్లాడుతూనే కాగితంలో నాలుగు వడలు, రెండు బజ్జీలు పొట్లం చుట్టి వాళ్ళకిచ్చి చెప్పింది.

''ఇంట్లో పిలకాయలకు ఇయ్యండి. ఈ దినం టీ దుడ్లు ఒద్దులే. దీనిక్కూడా డబ్బులొద్దు''

వాళ్ళు టీలు తాగి, ఆమెకు వెళ్ళొస్తామని చెప్పి అక్కడ్నుంచి కదిలారు. వాళ్ళు వెడుతున్న వైపు చూసి గాఢంగా నిట్టూర్చింది శివకాయమ్మ.

నడుము వద్ద చెక్కిన వక్కాకు సంచీ బయటకు తీసి, వక్కాకు వేసుకుని, నములుతూ, కొంచెం గొంతు తగ్గించి మాట్లాడసాగింది.

''ఏం ఊరో ఏం మనుషులో అబ్బోడా. నిన్ను చూస్తానే ఊరు గుర్తొచ్చింది. నేను పుట్టి పెరిగి ఆటలాడుకోనుండే ఊరు కదా. ఊరు గుర్తొచ్చినప్పుడంతా మనసు లాగతానే వుంటుంది. మళ్ళీ వెనక్కి వెళ్ళిపోవాలని. అయినా ఆ మనుషులు గుర్తొస్తే సాలు.. జల్మలో మళ్ళీ ఆ ఊరికి పోకూడదనిపిస్తుంది. మనసు అంతగా రోశిపోయింది చిన్నోడా. నా మొగుడ్ని పసిపిల్లోడి మాదిర్తోనే కదా సాకతా వుండా. మళ్ళింకా నాకు పిల్లలపైన కలవరం దేనికి? నా మొగుడు నాతో సంసారం చేస్తాండాడో లేదో ఊర్లోని మొగనాబట్టల కెందుకు చెప్పు? మీసమున్నోడంతా రాత్రయితే సాలు నా కొంపకాడికి తిరిగేదే. యాడ నేను సందు వదలతానో అని కుక్కల్లాగా నా ఎంటబడేదే. బూముండేదేమో అడివి అనుకుని. ఊర్లో చూస్తే ఈ నాబట్టలు. అడివిలోంచి అడివిపందులు. ఏం పంట చేసినా రాత్రికి రాత్రి అడివిపందులు పంట నాశనం చేసేసి పోతాంటే నేనేం సేద్యం చెయ్యల్నో, ఎట్లా బతకాల్నో చెప్పు. అడికీ కాపలాకని మంచి కుక్కని ఒకదాన్ని సాకతావుంటి. ఆ కుక్క ఉన్నెన్ని దినాలూ ఊర్లో జనాలకూ కొంచెం బయముండె మా యింటి కల్ల రావాలంటే. ఎవురేం చేసినారో, అడివిపందులు సంపినాయో, ఊర్లో మనుషులే సంపినారో కానీ కుక్క కడాకి సచ్చిపాయ. పంటకోసం పొలం చుట్టూ కరెంటు పెడితే అడివి పందొకటి సచ్చిపాయ. అప్పుడు గదా ఊర్లో రెడ్లూ, నాయుళ్ళంతా ఒకటై పంచాయితీ చేసి నా బతుకు నాకు గాకుండా చేసినారు. వాళ్ళ నోట్లో పురుగులు పడా''

వేదనతో మొదలైన ఆమె గొంతు దుఃఖాన్ని దాటి ఆగ్రహాన్ని ప్రకటించసాగింది.

''ఆ పాత్రలు కడిగేయబ్బా. వానొచ్చేట్లుండాది. ఎలబారదాం''అని భర్తకు పని పురమాయించింది.

అతడు ఊ అనలేదు. ఆ.. అనలేదు. తల వంచుకుని ఆమె చెప్పిన పనిలో నిమగ్నమయ్యాడు. ఆ పని చెయ్యటంలో అతడికి ఏ మాత్రం ఆసక్తిగానీ, అనాసక్తి కానీ ఉన్నట్లు అనిపించడం లేదు.

''ఎవురో ఫారెస్టోళ్ళకు ఉప్పందించినారు. అయినా రెడ్లూ నాయుళ్ళూ కాపోళ్ళు ఎన్నిసార్లు అడివి జంతువుల్ని ఏటాడి విందు మాంసం భాగాలు చేసుకుని తినలేదు చెప్పు. వాళ్ళనంతా వొదిలేసి నా కొంపమీద పడినారు కదా ఫారెస్టోళ్ళు. అడివిలో అయినా ఊర్లో అయినా డబ్బుండేవాడు, పెద్దకులమోడు ఏం చేసినా జరిగిపోతాండాది. నాలాంటి తక్కువ కులం, ఒంటరి ఆడదంటే అందురికీ అలుసే కదా. కేసు పెడతామని, జైలుకు పంపిస్తామని ఫారెస్టోళ్ళు మొండికి కూసున్నారు. వాళ్ళని ఎగదోసిందేది మనూరి కాపోల్లే కదా. అడివి జంతువుల్ని సంపితే మనిషిని సంపిందాని కన్నా పెద్ద నేరమట. పెద్ద పెద్ద శిక్షలేస్తారంట. అయినా నేనేం కావాలని సంపినానా. పొలం కొల్లబోతాండాదని,అడవి పందుల్ని అదుపు చెయ్యమని ఎన్నితూర్లో ఫారెస్టోళ్ళకు అర్జీలిచ్చినా. ఎమ్మార్వోని అడుక్కున్నా. ఎవురూ ఏమీ చేసిండేది లే. అడివి జంతువులు అడివిలో కదా వుండల్ల. అడివిని ఒదిలి నా పొలం పైన పడి నాకు జరుగుబాటు లేకుండా చేస్తావుంటే కదా కరెంటు పెట్టినా. అది తప్పెలా అవుతుంది? నేరమెట్లా అవుతుందని కడుపుకి అన్నం తినే వాడు ఒక్కడైనా ఆలోచిచ్చింటే కదా''

చీర కొంగుతో మొహం తుడుచుకుని, గొంతు సవరించుకుంది. పెనంలోంచి చల్లారిన కాగిన నూనెను

స్టీలు గిన్నెలోకి ఒడుపుగా వంచి, నూనె మొత్తం కారిన తర్వాత స్టీలు గిన్నెకు మూత పెట్టింది. వాటిని అందుకున్నాడు సుబ్రమణ్యం. దూరంగా వెళ్ళి వక్కాకు ఉమిసి వచ్చింది ఆమె. అప్పటికే దుకాణం మూసివేసి, తయారుగా నిలబడి ఆమెకోసం ఎదురు చూస్తున్నాడు సుబ్రమణ్యం.

ఇంకేమైనా వస్తువులు బయటే ఉండిపోయాయేమో అన్నట్లు ఆమె పరిసరాల్ని పరిశీలనగా గమనిస్తూ ''పద అబ్బోడా. మేమూ బస్టాపు దాకా వస్తాం'' అంది ముందుకు కదులుతూ.

అప్పటిదాకా ఓ చివరన నిలబెట్టి వున్న పాత సైకిల్‌ను గమనించనే లేదు నేను. సుబ్రమణ్యం వైరు బుట్టను, హ్యాండిల్‌కు తగిలించుకుని సైకిల్‌ను తోసుకుంటూ మమ్మల్ని అనుసరించసాగాడు.

''అపరాదం కట్టాల్సిందేనని పంచాయితీలో తేల్చి చెప్పేసినారు. ముప్పై వేలు కట్టాలంటే మాటలా. మానం, మర్యాదకి కట్టుబడి నేలను అమ్మేస్తి. నేల ఎకరా అమ్ముతాం డమంటే న్యాయం ఎవురూ ముందుకు రాలే. అమ్మితే మొత్తం రెండెకరాలు అమ్మేయమని న్యాయం చెప్పిరి. అట్లే అమ్మేస్తి. మేకపిల్లని, కోడి పుంజునీ అమ్మేస్తి. అపరాదం కట్టేసి ఊరువొది లేసి మానం, మర్యాద లేని చోట బతుకెందుకని ఇదో ఈ ఊరొచ్చి చేరినాం. ఉన్నెంతలో గౌరవంగా తలెత్తుకుని మా బతుకు మేం బతకతా వుండాం. ఈడెవురూ మా కులం అడిగేవోళ్ళు లేరు. సాలోళ్ళు కదా అని తక్కువ సూపు చూసేవాళ్ళూ లేరు. అస్తి పాస్తులుండాయా, అని చూసి మర్యాదిచ్చే వోళ్ళు, మానం పిరికేవోళ్ళూ లేరు. ఈడుండే బాధలు ఈడా వుండాయి. అయినా, మానం, మర్యాద వున్నెంత కాలం ఏ ఊరయినా మనిషికి తల్లిమాదిరి దాపుంటుంది అబ్బోడా. రా మా ఇంటికి పోదాం. అన్నం తినేసి పోదువుగానీ''

నా గొంతుకేదో అడ్డం పడుతోంది. వెంటనే నా నోట్లోంచి మాట రావటం కష్టమైపోయింది. ఆమె వెనుక ఇంత కథ వుందని అప్పటివరకూ నాకు ఊహామాత్రంగా అయినా తెలియదు.




ఆమె మొహంలో, గొంతులో ముందు విచారం కనిపించింది. తర్వాత కోపం, ఆవేశం ప్రకటితం అయ్యాయి. ఇప్పుడు ఆమె గొంతులో దుఃఖం, ఆవేశం, కోపం ఇవేవీ కనిపించటం లేదు. ఆమె మొహం వైపు తేరిపారా చూసాను. వీధిలైట్ల వెలుతురులో, మసక చీకట్లో, చామన చాయ రంగులో ఆ మొహంలో ఏ భావాలు కదలాడుతున్నాయో తెలుసుకోలేక పోయాను. ఆమె గొంతులో, ఆమె మొహంలో లీలగా గంభీరత గోచరిస్తోంది.

మరోసారి వాళ్ళింటికి తప్పకుండా వస్తానని చెప్పి, ఆమె కదిలింది.సుబ్రమణ్యం సైకిల్ తొక్కుతున్నాడు. వెనుక ఆమె కూర్చొని వుంది. తల తిప్పి చేయి ఊపింది. నేనుకూడా కుడిచేతిని గాల్లోకి ఆడించాను.

వాళ్ళిద్దరూ వెడుతున్న వైపే అలా చూస్తుండిపోయాను. ఆమె కుడిచేతిని అతడి మెడపక్కన, భుజం పైన వేసి, గట్టిగా పట్టుకుంది కాబోలు.

వాళ్ళనలా చూస్తూ వుంటే, ఎవరినుండి ఎవరు భద్రత పొందుతున్నారనే ప్రశ్న నాలో ఎన్నో ఆలోచనల్ని రేకెత్తించింది. ఆమె గురించి కొన్ని ప్రశ్నలు, కొన్ని సందేహాలు, మరికొన్ని అనుమానాలు మిగిలి వున్నాయనిపించింది. ఆలోచిస్తూనే తల విదిలించాను. సెల్ మళ్ళీ రింగ్ అయ్యింది.

సెల్ ఫోను వైపు చూశాను. మా ఆఫీసునుండి.

ఒకరోజు లీవు క్యాన్సిల్ చేసుకుని రేపు ఉదయం ఎక్కడ వున్నా సరే ఆఫీస్‌కు వచ్చేయమని ఆదేశం. నేనింక చెప్పటానికేమీ లేదు. గుడ్‌నైట్ చెప్పి ఫోన్ కట్ చేసాను.

వెంటనే మళ్ళీ సెల్ రింగ్ అయ్యింది. కిషోర్ చేస్తున్నాడు.

''వొస్తున్నారా. నీ పుస్తకాలు భద్రంగానే వున్నాయి. బస్‌కోసం వెయిట్ చేస్తున్నా'' అన్నాను తడారిపోయిన గొంతును సవరించుకుంటూ.

''వొద్దురా. సారీ. మా కంపెనీ వాళ్ళు ఫోన్ పైన ఫోన్ చేస్తున్నారు. నేను యిటునుంచి యిటే హైదరాబాద్ వెడుతున్నాను. రైలు లేకపోతే బస్సు. అదీ లేకపోతే టాక్సీ. కాళ్ళకు లేపనాలుండే బావుండురా. మరి నేను వెళ్ళొస్తారా'' గబగబా మాట్లాడుతున్నాడు కిషోర్.

మాటల్లో వేగం, చాకచక్యం ఉద్యోగ ధర్మంలో భాగంగా బాగా అలవడిపోతున్నాయి మనుషులకు. అనుకుంటూనే ''నీ పుస్తకాలు, లగేజ్ మాటేమిటి? నదులు, సముద్రాలు, అడవులు, పర్యావరణం, అంతరించి పోతున్న అరుదైన జాతులు- ఈ పుస్తకాల సంగతేమిటి? రైల్వే స్టేషన్‌కు రానా'' అని అడిగాను పుస్తకాల్ని తడిమి చూసుకుంటూ.

''వొద్దొద్దు. నువ్వొచ్చేసరికి మరో గంట పడుతుంది. ఆ పుస్తకాలు నా ప్రాజెక్ట్ వర్క్‌లో భాగం అంతే. కొత్త సాఫ్ట్‌వేర్ ప్లాన్ చేస్తున్నా.

కొరియర్‌లో పంపించెయ్. లగేజ్ ఏముంది? జత బట్టలు, వుండనీలే. ఎప్పుడో ఇంకోసారి వస్తాకదా బెంగుళూరికి. బాయ్..రా''

''అదేంరా. అసలు నిన్ను సరిగ్గా చూసినట్లయినా లేదు. అప్పుడే వెళ్ళిపోతున్నావ్. ఆ సెల్ స్విచ్ ఆఫ్ చేసుండొచ్చు కదా'' అన్నాను కొంచెం విసుగ్గా, బాధగా.

వాడు మెల్లగా నవ్వాడు. నీకు తెలీదారా. కంపెనీ వాడు సెల్లు ఇచ్చేది రాత్రీ పగలూ వాడికి అందుబాటులో వుండాలనే కదా. స్విచ్ ఆఫ్ ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదనేది ఒక అగ్రిమెంట్. సరేరా.. మళ్ళీ కలుద్దాం. అంతరించిపోతున్న అరుదైన జాతుల గురించి నీకేమైనా మెటీరియల్‌లో దొరికితే నాకు పంపించు. గుడ్‌లక్‌రా. గుడ్‌నైట్. బాయ్''

గుడ్‌నైట్, హ్యాపీ జర్నీ చెప్పి సెల్ జేబులో పెట్టేసుకున్నాను. సెల్‌ఫోన్ జేబులో పెట్టుకోకూడదని అంటారు. నడుం వద్ద పెట్టుకోకూడదంటారు. వాడకం తగ్గించాలంటారు. వర్షపు సమయాల్లో ముఖ్యంగా ఆరుబయట ఉపయోగించకూడదనీ అంటారు. అన్నీ నిజాలే. సెల్‌ఫోన్ వాడకుండా వుండలేని పరిస్థితులు? స్విచ్ ఆఫ్ చెయ్యటానికీ లేదు. ఎప్పటికీ తప్పించుకోలేని వలయంలో యిరుకిరుగ్గా ఇరుక్కుపోయిన ఫీలింగ్ కలుగుతోంది. ఊపిరాడనివ్వనంత హడావిడి. ఉరుకులు, పరుగులు.. సంపాదన తప్ప సంపాదిస్తున్నదేం లేదు. పోగొట్టుకుంటున్నవి మాత్రం చాలానే వున్నాయి.

మళ్ళీ శివకాయమ్మ గుర్తొచ్చింది. ఆమె మాటలు గుర్తొచ్చాయి. ఊర్లో ఆమె పోగొట్టుకుంది ఏమిటో, నగరంలో ఆమె వెతుక్కుంటున్నది ఏమిటో లీలగా అర్థమవుతున్న కొద్దీ, మనస్సులోని భారం క్రమంగా తగ్గుతున్నట్లు అనిపించసాగింది.

చప్పున సెల్‌ఫోన్ తీసి కిషోర్‌కి డయల్ చేసాను.

''రేయ్.. అంతరించిపోతున్న అరుదైన జాతుల్లో మనం కూడా వున్నాం రా. మనిషి స్వేచ్ఛ, మానవత్వం అంతరించిపోతున్నాయి గమనించావా'' అన్నాను ఒకరకమైన ఉద్వేగంతో.

వాడికి నేను చెప్పింది కొంచెం కూడా అర్థమైనట్లు లేదు.

''నాకు మెయిల్ ఇవ్వరా. ఇ-మెయిల్ చదువుకుంటూ తర్వాత ఫోన్ చేస్తాలే'' అన్నాడు హడావిడిగా కిషోర్.

ఇదంతా కంప్యూటర్లో పంపించేది కాదనిపించింది. ఈ మాటల్ని, ఈ భావాల్ని, స్పందనని చేత్తోనే రాయాలి. రాస్తే, రాయగలిగితే ఉత్తరమే రాయాలి. అవును ఉత్తరాలు రాయాల్సివుంది. వాడికే కాదు చాలామందికి మరచిపోతున్న ఆత్మీయులకి, దూరమైన దగ్గరి వాళ్ళకీ...

రెండు చేతులతో జుట్టు సవరించుకుని, తలాడించి స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నాను గుండెనిండుగా. ★